# నేడు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**గ్రామాల్లో ప్రారంభం కానున్న ఎన్నిక ప్రచారం**

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 16 : మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామ పరిధిలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం పూజలు చేయనున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రావులపల్లి, ముడిమ్యాల్, కుమ్మెర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# ఇద్దరు దొంగల అరెస్ట్, రిమాండ్



మహ్మద్ బిన్‌సెలేమాన్ బనార్


షేక్ అహ్మద్

ఆదిబట్ల, అక్టోబర్ 16 : మేకల మంద వద్ద అర్ధ రాత్రి కాపర్లు లేని సమయంలో మేకలను ఎత్తుకెళ్లి అమ్ముకుంటున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిదిలో సోమవారం జరిగింది. ఆదిబట్ల ఎస్సై శ్రీనివాస రావు తెలిపిన వివరాలు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో దండిగ శేఖర్‌కు చెందిన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఆయన ఈ ఘటనపై ఆదిబట్ల పోలీసులకు పిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నగరంలోని బార్కాస్‌కు చెందిన మహ్మద్ బిన్‌సెలేమాన్ బనార్, షేక్ అహ్మద్‌ను గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. వారు నగరం నుంచి ఇక్కడ మేకలను ఎత్తుకెళ్లి నగరంలో అమ్మేవారని తెలిపారు. వారి నుండి 15 మేకలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

# జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు


పోలీసుల అదుపులో నిందితుడు

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 16 : బైకులు, ఆటోలను అపహరిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎంబీఆర్ నగర్‌కు చెందిన బూడిద నర్సింహారెడ్డి తన ఇంటి ముందు పెట్టిన బైకు దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని.. వాహనాలు తనిఖీ చేస్తుండగా... ఎలాంటి పత్రాలు లేకుండా నడుపుతున్న వాహనాలను పట్టుకుని విచారణ జరిపారు. మచ్చ మహేశ్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న విషయం తెలుసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మైబెల్లి తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 16 : పెద్దఅంబర్‌పేట ఇండస్ట్రియల్ ఫీడర్, పెద్దఅంబర్‌పేట పట్టణ ఫీడర్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట పట్టణం, సూర్య వంశీ కాలనీ, కొహెడ రోడ్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రమౌళి తెలిపారు. అలాగే తట్టిఅన్నారం పరిధిలోని లక్ష్మీగణపతి కాలనీ, జ్యోతిపురం, హనుమాన్‌నగర్, రాఘవేంద్రకాలనీ, సూర్యామెడోస్, ఎస్సీ కాలనీ, ఆర్ఎన్ఆర్ ఫేజ్–2లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. సదాశివ, బ్యాంక్ కాలనీ, బలిజగూడ రోడ్, శిల్పి కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

# జాతీయ అవార్డు అందుకున్న తాండూరు వాసులు


జాతీయ అవార్డు అందుకున్న రామకృష్ణ, రాజ్‌కుమార్

తాండూరు, అక్టోబర్ 16: బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు–2023కు తాండూరు చెందిన పర్యాద రామకృష్ణ, కందుకూరి రాజ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధులు వీరికి అవార్డులను అందుకొన్నారు. 'విద్యారత్న' పురస్కారాన్ని తాండూరు పట్టణానికి చెందిన భాష్యం కళాశాల అధ్యాపకుడు పర్యాద రామకృష్ణ అందుకోగా 'మహాత్మా జోతిబాపూలే' జాతీయ పురస్కారాన్ని తాండూరు పట్టణానికి చెందిన జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అందుకున్నారు. ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సుల్లో విద్యారంగంలో చక్కటి సేవలు అందిస్తున్నందుకు రామకృష్ణ, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు రాజ్‌కుమార్ జాతీయ పురస్కారం అందుకోవడంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు తాండూరు ప్రజలు, ప్రముకులు అభినందిస్తు సన్మానాలు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించాలని కోరారు.

# బస్టాండ్‌లో వివాహితపై లైంగికదాడి

చేవెళ్లటౌన్, అక్టోబర్ 16 : బస్టాండ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వివాహితపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాలు.. కేశంపేట మండలం కొత్తపేటకు చెందిన యువతికి నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. వారం రోజులకే భర్తతో విభేదాలు రావడంతో తల్లిగారి వద్దే ఉంటుంది. ఆమె ఆదివారం తల్లిదండ్రులతో గొడవ పడి చేవెళ్లలో ఉన్న అక్క వద్దకు వచ్చింది. అయితే అక్క ఇంటి వద్ద లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక కల్లు తాగి చేవెళ్ల బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్‌లో బస్సు లేకపోవడం, మత్తుగా ఉండడంతో అక్కడే పడుకుంది. రాత్రి 10 గంటల తర్వాత బస్టాండ్‌లో ఎవరూ లేకపోవడం, ఒంటరిగా నిద్రిస్తున్న వివాహితను చూసిన చేవెళ్లకు చెందిన ఇద్దరు యువకులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కొందరు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ఆమె ఉన్న పరిస్థితిని చూసి సీసీ పుటేజీలను పరిశీలించారు. చేవెళ్లకు చెందిన అనిల్ కుమార్, రాజు అత్యాచారం చేసినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# అల్లరి

ALLARI

## చెప్పుకోండి



1. తెహ్రీ డ్యామ్‌ను ఏ నదిపై నిర్మించారు?
2. జార్ఖండ్ రాజధాని ఏది?
3. భారతదేశపు తొలి మహిళా గవర్నర్ ఎవరు?

## చిలుక నేర్పిన పాఠం





**ఒక** అడవిలో రామచిలుక – కోతి స్నేహంగా ఉండేవి. రామచిలుక తెలివైనది. కోతికి లోకజ్ఞానం తక్కువ. ఒక రోజున చిలుక నేరేడు చెట్టు మీద కూర్చుని పండ్లు తింటున్నది. కోతేమో పక్కనున్న చెట్టుమీద గంతులు వేస్తూ సీతాఫలాలు ఆరగిస్తున్నది. ఇంతలో కింద కాలిబాట మీద ఓ వ్యక్తి నడుస్తూ వెళ్తున్నాడు. చిలుక ఒక నేరేడు పండు కోసి అతని మీదికి విసిరేసింది. పండు మీద పడగానే అతను ఉలిక్కిపడి పైకి చూశాడు. చిలుక నవ్వుతూ.. ''హాయిగా పండు తిను మిత్రమా!'' అన్నది. దాని ముద్దు మాటలకు సంతోషించిన బాటసారి ఆ పండు తిన్నాడు. ''ఇంకో రెండు తింటావా?'' అంటూ చిలుక మరో రెండు పండ్లు పడేసింది. బాటసారి అవి కూడా తిని.. ''నీకు దేవుడు మేలు చేస్తాడు!'' అని ఆశీర్వదించి వెళ్లిపోయాడు. చిలుక చేసిన పనిని కోతి ఆశ్చర్యంగా చూసింది. ''అతనికి పండ్లు ఎందుకిచ్చావు?'' అని అడిగింది. ''మన దగ్గరున్న దాంట్లో ఇతరులకు సహాయం చేస్తే.. వాళ్లు మనకు ఆశీర్వాదం ఇస్తారు. దేవుడు మనకు మేలు చేస్తాడు'' అని చెప్పింది చిలుక. కోతి కూడా ఇకనుంచి అలాగే చేయాలని నిర్ణయించుకుంది. మర్నాడు అదే దారిన ఓ బాటసారి వెళ్తుంటే.. ఒక బాగా పండిన సీతాఫలాన్ని అతని మీదికి విసిరేసింది కోతి. ఉలిక్కిపడి పైకి చూశాడతను. కోతి పళ్లు ఇకిలించింది. అతని తల, బట్టల మీద చితికిపోయిన సీతాఫలం గుజ్జు, విత్తనాలు పడి.. అతని దుస్తులన్నీ చెడిపోయాయి. అతను కోపంగా కోతి వంక చూసేసరికి.. ఇంకోటి కావాలనుకుంటున్నాడని మరో పండు విసరబోయింది. వెంటనే బాటసారి ఓ రాయి తీసి కోతిపైకి విసిరాడు. అది భయపడి పారిపోయింది. 'చిలుకను ఆశీర్వదించిన మనుషులు నన్నెందుకు రాళ్లతో కొడుతున్నారు?' అనుకున్నది కోతి. 'చిన్న నేరేడు పండుకే చిలుకను దీవించారు. ఇంకా పెద్ద పండు ఇస్తే నన్ను బాగా పొగుడుతారు!' అనుకున్నది. మర్నాడు కోతి మరో చెట్టు మీద కూర్చుని ఉంది. ఆ సమయంలో కాలిబాట మీద ఇద్దరు మిత్రులు కబుర్లు చెప్పుకొంటూ పోతున్నారు. వెంటనే తను కూర్చున్న చెట్టు పండును తెంపి వారి మీద పడేసింది కోతి. ఆ కాయ ఎవరి మీద పడిందో.. ఆ మనిషి కాస్తా మూర్ఛపోయాడు. రెండోవాడు తలెత్తి చూస్తే చెట్టుమీద కోతి కనిపించింది. దాంతో వాడు కోపంతో చేతిలో ఉన్న కర్రను కోతి మీదికి బలంగా విసిరాడు. 'పెద్దపండు ఇచ్చినా కూడా ఈ మనుషులకు కృతజ్ఞత లేదు.. నన్ను రాళ్లతో, కర్రలతో కొడుతున్నారు?' అనుకుని చిలుక దగ్గరికి వెళ్లి, తన సందేహం వెల్లడించింది. ''ఇంతకూ ఆ మనుషుల మీద ఏ పండు పడేశావు?'' అని అడిగింది చిలుక. ''పెద్ద పండు పడేస్తే మనుషులు ఆనందిస్తారని.. తాటిపండు పడేశాను.. అంతే!'' అన్నది కోతి అమాయకంగా. దాంతో చిలుక పగలబడి నవ్వింది. ''మిత్రమా! పెద్దపండు వేస్తే వాళ్ల తల పగిలిపోతుంది. పండిపోయిన సీతాఫలం వేస్తే ఆ బాటసారి దుస్తులు ఖరాబయ్యాయి కదా! అందుకే వాళ్లకు కోపం వచ్చింది. నువ్వు నేరేడు, ద్రాక్ష, రేగు వంటి చిన్న పండ్లు వేస్తే వాళ్లకు దెబ్బలు తగలవు. పైగా నిన్ను మెచ్చుకుంటారు'' అని చెప్పింది. అప్పటికి గానీ కోతికి తన తప్పేంటో తెలియలేదు.

**నీతి :** ఇతరులకు మేలు చేస్తున్నాం అనుకుంటూ.. వారికి హాని చేయకూడదు.

• చంద్రప్రతాప్ కంతేటి

## ఆ పదమేంటి?

ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.




**జవాబులు**

చెప్పుకోండి : 1. తుంగభద్ర, 2. రాంచీ, 3. సరోజినీ నాయుడు

ఆ పదమేంటి? : quail

## విటర్ హ్యాండ్స్

**అడ్ల వసుంధర**





## పదసృష్టి



**కింది** పదంలోని అక్షరాలతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Below

Ex : Low

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com

## తేడాలు కనిపెట్టండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 7 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి

